# చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాది

## గుడిహత్నూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభం



**గుడిహత్నూర్:** చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాది అని గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం తిరిగి ప్రారంభమైన కేంద్రాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, స్నాక్స్ అందజేసి సాదరంగా స్వాగతించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిఖిల్, అంగన్‌వాడీ టీచర్లు, కేంద్రాల సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీలో ఉద్యోగం సాధించిన యువకుడికి ఘన సన్మానం



**గుడిహత్నూర్:** మండలంలోని డోంగర్‌గావ్ గ్రామానికి చెందిన సాంకాంబ్లే అజయ్ ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం సాధించడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అబ్దుల్ రహెమాన్ ఆధ్వర్యంలో అజయ్‌కు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామానికి గర్వకారణంగా నిలిచిన యువ సైనికుడు అజయ్‌ను సర్పంచ్ అబ్దుల్ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ యువత కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతిఒక్కరూ దేశ సేవ పట్ల అంకితభావంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ గ్రామానికి చెందిన యువకుడు దేశ సరిహద్దులను కాపాడే ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం సాధించడం తనకు, యావత్ గ్రామానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అజయ్‌ను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని మరింత మంది యువకులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ అబ్దుల్ రహెమాన్ నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు యువతను ప్రోత్సహించడంలో సర్పంచ్ చూపుతున్న చొరవను గ్రామస్థులు ప్రశంసించారు.

## రోడ్డు ప్రమాదంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

### దర్యాప్తు ప్రారంభించిన ఎస్.హెచ్.ఓ శ్రీకాంత్

**గుడిహత్నూర్:** మండల పరిధిలోని కొల్హారి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై బాధితుడి కుమారుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీకాంత్ తక్షణమే స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్హారి గ్రామానికి చెందిన కాగ్నే మాధవరావు అనే రైతు ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వ్యవసాయ పొలానికి బయల్దేరి వెళ్లాడు. మార్గమధ్యలో కల్వర్టు వద్ద ఒక్కసారిగా కుక్క అడ్డం వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో మాధవరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం సాయంత్రం 6.59 గంటలకు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. బాధితుడి కుమారుడు కాగ్నే సాయి నాథ్ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన ఎస్.హెచ్.ఓ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి




**తాండూర్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ సర్వీస్ రోడ్డుపై సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, మురుగు కాలువల శుభ్రత వంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, నెలకు రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్‌లు, చెప్పులు, సబ్బులు, ఇతర అవసరమైన సామాగ్రిని ప్రభుత్వమే అందించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల పెంపులో శాస్త్రీయత లేదని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, కార్మికుల జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు నిర్ణయించలేదని అన్నారు. ప్రభుత్వం కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని ప్రకటించిన వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వెల్పుల శంకర్, బొల్లం రాజేశం, మొగిలి, హక్కు, అక్బర్, నందిపేట వెంకటి, ఇప్ప రామయ్య, ఇప్పదురుగు, ఇప్ప ఎల్లమ్మ, ఇప్ప సుజాత, కాజీపేట కమల, రామగిరి రాధ, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# వర్షా కాలంలో వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



**సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అయ్యగారిపేట అంబేద్కర్ నగర్ 3వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, వర్షాకాలంలో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు అధ్యక్షత వహించారు. సమావేశంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుధ్యం, రోడ్లు, వీధిదీపాల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు, కలుషిత నీటి సమస్యలను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపర్చడం, బ్లాక్ అయిన డ్రైనేజీలను వెంటనే మరమ్మతు చేయడం అవసరమని నిర్ణయించారు. అలాగే పాడైన రోడ్లను మరమ్మతు చేయడం, అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేయడం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. కాగా కాలనీవాసులు తమ సమస్యలు, వినతులను వైస్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా, వాటిని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం, దోబీ ఘాట్ నిర్మాణ పనుల పరిశీలన





**సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న నూతన అంబేద్కర్ భవనం, వేంసూరు రోడ్డులోని దోబీఘాట్ భవన నిర్మాణ పనులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ప్రజలకు అందించనున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమలపాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ అధికారులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సత్తుపల్లి పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో నిర్వహించిన జంగాల నాగేశ్వరరావు తల్లి స్వర్గీయ జంగాల సీతారత్నం దశదిన కర్మ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. జంగాల సీతారత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# గోపాల్పూర్ గుడిసెలు కూల్చేసిన స్థలంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా




**హన్మకొండ:** గోపాల్పూర్‌లో పేదల గుడిసెలను కూల్చివేసిన స్థలంలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి బాధిత కుటుంబాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం హన్మకొండ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా గుడిసెలను తొలగించడం అన్యాయమని విమర్శించారు. ఎన్నో సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలు నివాసం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమం పేరుతో పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, భూమి లేని నిరుపేదలకు నివాస హక్కు కల్పించడంలో విఫలమవుతోందని ఆరోపించారు. గుడిసెలు కూల్చిన అదే ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి బాధితులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గోపాల్పూర్ బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

# సింగరేణి గనిలో ఘోర ప్రమాదం

- బొలెరో జీపుపై పల్టీ కొట్టిన భారీ డంపర్
- డ్రైవర్కు తీవ్ర గాయాలు



**సత్తుపల్లి:** సత్తుపల్లి మండల పరిధిలోని జేవీఆర్ సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిలో సోమవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉపరితల గనుల్లో బొగ్గు రవాణా కోసం వినియోగిస్తున్న భారీ డంపర్ అదుపుతప్పి బొలెరో జీపుపై పల్టీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. డంపర్ జీపుపై పడటంతో బొలెరో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాద సమయంలో జీపులో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఘటనను గమనించిన సింగరేణి సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన డ్రైవర్‌ను అంబులెన్స్ ద్వారా సింగరేణి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే గని ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై విచారణ ప్రారంభించారు. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో గనుల్లో అమలవుతున్న భద్రతా ప్రమాణాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీ యంత్రాల నిర్వహణ, భద్రతా చర్యల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కార్మికులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉండగా, అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- కొరారీలో సీఎం రేవంత్ రెడ్డి సందడి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఆడే గజేందర్


**బోథ్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండల పరిధిలోని కొరారీ గ్రామపంచాయతీ కొత్తగూడలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కాన్వాయ్‌లో ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. గృహ ప్రవేశ కార్యక్రమాల అనంతరం ఆడే గజేందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలపై మోపిన భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**హన్మకొండ:** ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మోపుతున్న భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హన్మకొండ మండల తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ బడా బాబులకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై మోయలేని ఆర్థిక భారాలు మోపుతోందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరుగుతున్న తరుణంలో పెట్రోల్,



డీజిల్ ధరల పెరుగుదల ప్రజల జీవితాలను మరింత కష్టాల్లోకి నెట్టిందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవన వ్యయం రోజురోజుకూ పెరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు మేల్కొని తమ హక్కుల కోసం పోరాడకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజా ఉద్యమాల పట్ల చైతన్యం పెంపొందించుకొని సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఇంద్రారెడ్డి, కునూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్:** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రాధాన్య బాధ్యత అని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 85 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, సంబంధిత





శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను సకాలంలో పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న పలువురు అధికారులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్డ్‌లో గుడిహత్నూర్ విద్యార్థి ప్రతిభ


**గుడిహత్నూర్:** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటీ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్డ్‌లో గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ముండే ఓంప్రసాద్ ప్రతిభ కనబర్చి అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్ కుమారుడైన ఓంప్రసాద్ సాధించిన ఈ ఘనతపై మండల వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో పలువురు ప్రముఖులు ఓంప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన స్వామి, బోథ్ ఐ న్యూస్ రిపోర్టర్ దిగంబర్, పలువురు మీడియా ప్రతినిధులు విద్యార్థి నివాసానికి చేరుకుని అభినందనలు తెలిపారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు




అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్డ్ వంటి జాతీయ స్థాయి కఠినమైన పరీక్షలో విజయం సాధించడం సాధారణ విషయం కాదని కొనియాడారు. ఓంప్రసాద్ సాధించిన విజయం గుడిహత్నూర్ మండలానికి గర్వకారణమని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఓంప్రసాద్ నిరూపించాడని అన్నారు. ఈ సందర్భంగా ఓం ప్రసాద్ మాట్లాడుతూ తన విజయానికి ప్రధాన కారణం తండ్రి ముండే సంజీవ్ అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారమేనని తెలిపారు. ప్రతి దశలోనూ తనకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితుల సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని అన్నారు. ఓంప్రసాద్ సాధించిన విజయంపై స్థానికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

**ఆదిలాబాద్:** ఎన్నికేదైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన భారీ చేరికల కార్యక్రమంలో వివిధ వార్డులకు చెందిన ప్రజలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలో కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వం, ఆయన చేపడుతున్న ప్రజాసేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ప్రజలు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. పట్టణంలోని 18వ వార్డు రణదివే నగర్ నుంచి కౌన్సిలర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో, 19వ వార్డు హైమద్ నగర్ నుంచి జమునాబాయి ఆధ్వర్యంలో కాలనీవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాసేవా భవన్ వేదికగా అందిస్తున్న సేవలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి బలమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి ఎన్నికలోనూ విజయ కేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,




అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామ సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదకర ప్రాంతాల్లో వేగ నియంత్రణ చర్యలు చేపట్టి రోడ్డు భద్రతను మెరుగుపర్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బుద్ధికొండ గ్రామంలో విషాదం

### మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య



**నేరడిగొండ:** మండలంలోని బుద్ధికొండ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. జీవితంపై విరక్తితో కత్తి పవన్ (18) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బుద్ధికొండ గ్రామానికి చెందిన కత్తి లక్ష్మణ్ కుమారుడు. గత కొంత కాలంగా నిరుద్యోగ సమస్యతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్న పవన్ ఉపాధి లేక జీవితంలో స్థిరపడలేకపోతున్నానని కుటుంబ సభ్యుల వద్ద తరచూ ఆవేదన వ్యక్తం చేసేవాడని తెలిపారు. మే 31న సాయంత్రం 6 గంటల సమయంలో తన మోటార్ సైకిల్‌పై నేరడిగొండకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన పవన్, రాత్రి 7 గంటల సమయంలో ఫోన్ చేసి త్వరలోనే ఇంటికి వస్తానని తెలిపాడు. అయితే ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని పవన్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి లక్ష్మణ్ పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం



**నేరడిగొండ:** ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, అవి విధి నిర్వహణలో భాగమని నేరడిగొండ తహశీల్దార్ ఎంఏ. కలీమ్ అన్నారు. సోమవారం నేరడిగొండ మండల రెవెన్యూ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న నలుగురు సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ తమ పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సిబ్బందిని చూసి గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు జరిగినప్పటికీ, ఒకే కార్యాలయంలో కలిసి పనిచేసిన అనుబంధం ఎప్పటికీ మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగోరావ్, జూనియర్ అసిస్టెంట్ రవి, అటెండర్ సుగుణలను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. కొత్త విధి నిర్వహణ ప్రాంతాల్లోనూ అదే నిబద్ధతతో పనిచేసి మరింత పేరు ప్రతిష్ఠలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

చురకలు



## ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థికి కలెక్టర్ అభినందనలు



**ఆదిలాబాద్:** ఇంద్రవెల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో ఉంటూ పదవ తరగతిలో ప్రతిభ కనబర్చి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి సూర్యవంశి శివప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థి శివప్రసాద్‌కు డిక్షనరీతో పాటు చేతి గడియారాన్ని బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివప్రసాద్ భవిష్యత్తులో మరింతగా చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివితే ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల నుంచే ఉన్నత అవకాశాలు సాధించవచ్చని పేర్కొన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి బి.సునీత, ఏఎస్డబ్ల్యూఓ నర్సింగ్, హెచ్డబ్ల్యూఓ రవి, విద్యార్థి తండ్రి, వసతిగృహ సిబ్బంది మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గంభీరావుపేట నూతన ఎస్సైగా సీహెచ్ శ్రీకాంత్



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా సీహెచ్ శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు గంభీరావుపేటలో విధులు నిర్వహించిన ఎస్సై అనిల్ కుమార్ సిరిసిల్లకు బదిలీ కాగా, ఆయన స్థానంలో సిరిసిల్ల పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సీహెచ్ శ్రీకాంత్ను గంభీరావుపేటకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నేరాల నివారణలో భాగస్వాములు కావాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది నూతన ఎస్సైకు శుభాకాంక్షలు తెలిపారు.

## పేదవాడి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **ర్యాగట్లపల్లిలో 40 ఇందిరమ్మ సామూహిక ఇండ్ల ప్రారంభం**
- **నిరుపేదల ముఖాల్లో ఆనందం చూడటమే మా ఉద్దేశం:గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి.**

**భిక్నూర్, కామారెడ్డి :**
గూడు లేని నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భిక్నూర్ మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' కింద నూతనంగా నిర్మించిన 40 ఇండ్లను వారు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొంత ఇల్లు లేని నిరుపేదలకు పక్కా గృహాలను అందించాలనే సదుద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామని భరోసా ఇచ్చారు. ఏళ్ల తరబడి సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న 40 కుటుంబాలకు ఒకేసారి నూతన గృహాలు అందించడంతో ర్యాగట్లపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులు, స్థానికులు ఈ సందర్భంగా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.ఈ ప్రారంభోత్సవ వేడుకలో స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, జిల్లా కార్యదర్శి లింగాల రాజబాబు గౌడ్, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళా ఎదుగుదలకు కృషి చేస్తున్న ప్రభుత్వం

### 23 వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ప్రియ భరత్

**సదాశివపేట, :**
వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ప్రియ భరత్ చేతుల మీదుగా మహిళలకు సోమవారం ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ప్రియ భరత్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘం అక్కాచెల్లెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరిగిందని, రాష్ట్రంలో ప్రతి ఒక్క మహిళ ధనిక మహిళల ఎదగాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జి, కాంగ్రెస్ నాయకులు శరత్ చంద్ర, డ్వాక్రా మహిళలు, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత





### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యావరణ పరిరక్షణ అంశంపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 99 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. జిల్లాలో పచ్చదనాన్ని పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని పేర్కొన్నారు. జల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, నీటి వృథాను అరికట్టి ప్రతి నీటి బొట్టును విలువైన వనరుగా భావించి పొదుపు చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, రీసైక్లింగ్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. భూమిపై ఉన్న ప్రతి జీవిని రక్షిస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను నియంత్రించాలంటే కార్బన్ ఉద్గారాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, సురక్షితమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. "పచ్చదనం పెంచుదాం– పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో జిల్లా ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించి, కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, జెడ్పీ సీఈఓ రవి, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నర్మాల గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు





**గంభీరావుపేట:** మండలంలోని నర్మాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రాజబోయిన అర్చన ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి కొత్త ఇళ్లలోకి ప్రవేశించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, కొత్త ఇంటి కల సాకారమైన ఆనందంలో లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు సొంత ఇంటిని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే ప్రభుత్వ సంకల్పం సాకారమవుతోందని ప్రజా ప్రతినిధులు, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గృహ పథకాల ద్వారా పేద, అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాకుండా కుటుంబ భద్రత, గౌరవం, భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుతు, ఉప సర్పంచ్ సుదర్శన్, రమేష్ గౌడ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఒరిగంటి నర్సింలు, లచ్చయ్య, చింతల రవి, రాయనర్సు, రాజు, సాగర్, సురేష్, పుల్లూరి రాజశేఖర్, ప్రవీణ్, బుచ్చయ్య, లింగం స్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాగుల మహేందర్, మల్లయ్య, గోపాల్, గుండెల్లి ఎల్లవ్వ, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాకం.. వరి కొయ్యలకు నిప్పు

**గంభీరావుపేట:** మండలంలోని లింగన్నపేట గ్రామ పరిధిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లో ఉన్న వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మండుటెండల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీపంలో నిల్వ ఉంచిన గడ్డివాములు, పశుగ్రాసం, స్టార్టర్లు, విద్యుత్ వైర్లు, బోరు పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న అటుగా వెళ్తున్న బ్లూ కోర్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానిక రైతుల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చి పూర్తిగా ఆర్పివేశారు. దీంతో మరింత పెద్ద నష్టం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న గంభీరావుపేట ఎస్సై సీహెచ్ శ్రీకాంత్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. ఈ ఘటనతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్య చర్యల కారణంగా తమ పశుగ్రాసం, వ్యవసాయ సామాగ్రి నష్టపోయాయని వాపోయారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమయస్ఫూర్తితో స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చిన బ్లూ కోర్స్ సిబ్బంది రమేష్, మహిపాల్ సేవలను గ్రామస్థులు, రైతులు అభినందించారు. వారి చొరవతో మరింత నష్టం జరగకుండా నివారించగలిగారని కొనియాడారు.



# సమయపాలన గాలికి..

## పింఛన్ల కోసం అవస్థలు పడుతున్న వృద్ధులు, వికలాంగులు



**నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ఉదయాన్నే కార్యాలయాన్ని తెరవాల్సి ఉండగా, ఉదయం 10 గంటలు దాటినా కార్యాలయం తలుపులు తెరవక పోవడంతో లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

**పింఛన్ల కోసం నిరీక్షణ..**

ప్రతినెలా ఆసరా పింఛన్ల కోసం తపాలా కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్న ఈ కాలంలో వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సి రావడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు..**

"మేము చాలా దూరం నుంచి నడుచుకుంటూ పింఛన్ కోసం వస్తున్నాం. సిబ్బంది సమయానికి రాకపోవడంతో ఎండలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం" అని లబ్ధిదారులు వాపోతున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న తపాలా కార్యాలయ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, కార్యాలయం నిర్ణీత సమయానికి తెరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# డీఈఓగా మాధవి బాధ్యతల స్వీకరణ

- **కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఈఓ**



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డి.మాధవి సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖలో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలు, విద్యాభివృద్ధి పథకాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే విద్యా శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. నూతన డీఈఓ జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తానని, విద్యార్థుల శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

